క్లుప్తంగా

వల్లభరావుపాలెం మహిళకు హెచ్‌పీ కంపెనీ స్కూటీ బహుమతి



పొన్నూరు (చేబ్రోలు): పొన్నూరు మండలం వల్లభరావుపాలెంకు చెందిన మహిళ కాట్రగడ్డ పుణ్యవతికి హెచ్‌పీ కంపెనీ ప్రతినిధులు బుధవారం స్కూటీని అందజేశారు. పట్టణానికి చెందిన తిరుమల గ్యాస్ అండ్ జనరల్ ట్రేడర్స్ మేనేజర్ వడ్లమూడి రాజేంద్ర మాట్లాడుతూ దసరా, మిలాద్ ఉన్ నబీ, క్రిస్మస్, దీపావళి సంక్రాంతి పండుగ సందర్భంగా హెచ్‌పీ గ్యాస్ కంపెనీ గుంటూరు డివిజన్ నుంచి బహుమతుల డ్రా తీసినట్లు తెలిపారు. సురక్ష మిత్ర పథకం కింద ప్రతి సురక్ష గ్యాస్ ట్యూబ్ కొనుగోలు చేసిన వారికి కూపన్లు ఇచ్చినట్లు తెలిపారు. డ్రాలో తెనాలి డివిజన్‌లో మొదటి బహుమతి పొన్నూరు ప్రాంతానికి వచ్చిందన్నారు. వల్లభరావుపాలెంకు చెందిన కాట్రగడ్డ పుణ్యవతికి కంపెనీ జనరల్ మేనేజర్ అవినాష్ జైన్ స్కూటీని, తాళాలను అందజేసినట్లు కంపెనీ మేనేజర్ వడ్లమూడి రాజేంద్ర తెలిపారు.

108లో ప్రసవం.. తల్లీ బిడ్డ క్షేమం

చేబ్రోలు: పురిటి నొప్పులతో బాధపడుతున్న గర్భిణిని 108 వాహనం ద్వారా వైద్యశాలకు తరలిస్తుండగా మార్గమధ్యలో ప్రసవించిన సంఘటన చేబ్రోలు మండలంలో బుధవారం జరిగింది. వెల్లలూరు ఎస్సీ కాలనీకి చెందిన గర్భిణి సీహెచ్ పరిమళకు పురిటినొప్పులు రావడంతో 108 వాహనం ద్వారా తెనాలి ప్రభుత్వ వైద్యశాలకు తరలిస్తున్నా రు. మార్గమధ్యలో వేజండ్ల అడ్డరోడ్డు వద్దకు వాహనం చేరే సమయానికి పురిటినొప్పులు అధికం కావటంతో వాహనాన్ని పక్కన నిలిపివేసి 108 సిబ్బంది గోరంట్ల ఇందిర, సీహెచ్ సాంబశివరావులు అత్యవసర వైద్యసేవలు అందించారు. పరిమళ మగబిడ్డకు జన్మనిచ్చింది. తల్లీ బిడ్డలు సురక్షితంగా ఉన్నారు. ఇరువురిని 108 వాహనం ద్వారా తెనాలి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. మహిళ కుటుంబసభ్యులు 108 సిబ్బందిని అభినందించారు.

పౌష్టికాహారం పంపిణీ

నెహ్రూనగర్: రాష్ట్ర ప్రభుత్వం గర్భిణులకు, బాలింతలకు సంపూర్ణ ఆరోగ్యం అందించేందుకు బలవర్ధక పౌష్టికాహారం అందజేస్తుందని 29వ డివిజన్ కార్పొరేటర్ షేక్ రోషన్ తెలిపారు. బుధవారం డివిజన్ పరిధిలోని చైతన్యనగర్ అంగన్‌వాడీ పాఠశాలలో బాలింతలు, గర్భిణీలకు ఆయన పౌష్టికాహారం పంపిణీ చేశారు.

ఆర్బీకేల్లో సోషల్ ఆడిట్ జాబితాలు

చేబ్రోలు: మండల పరిధిలోని అన్ని రైతు భరోసా కేంద్రాల వద్ద ఈ పంట సోషల్ ఆడిట్ జాబితాలను ప్రదర్శిస్తున్నట్లు చేబ్రోలు మండల వ్యవసాయశాఖాధికారి బి.శ్రీనివాసనాయక్ బుధవారం తెలిపారు. చేబ్రోలు-1 ఆర్బీకే వద్ద బుధవారం జరిగిన సమావేశానికి పొన్నూరు ఏడీఏ సీహెచ్ తిరుమలాదేవి హాజరయ్యారు. రైతు భరోసా కేంద్రాల వద్ద ఏర్పాటు చేసిన జాబితాలను పరిశీలించుకొని మార్పులు, చేర్పులు ఉంటే రైతులు ఆర్బీకే సిబ్బందికి తెలియజేసి సరిచేసుకోవాలని తెలిపారు. ఈ జాబితాను అనుసరించే రైతులకు పంటల బీమా, ప్రొక్యూర్‌మెంట్‌కు అర్హులని ఏడీఏ తిరుమలాదేవి, ఏఓ శ్రీనివాసనాయక్‌లు తెలిపారు. స్థానిక రైతులు, వీఏఏలు పాల్గొన్నారు.

సాగు వివరాలను సరి చూసుకోవాలి

కాకుమాను: ఈఏడాది రబీ సీజన్‌లో వివిధ రకాల పంటలు సాగు చేసిన రైతుల వివరాలను సరి చూసుకోవాలని ఏఓ కె.కిరణ్మయి సూచించారు. మండలంలోని గ్రామాలలో బుధవారం రైతు భరోసా కేంద్రాలలో రబీ సీజన్‌లో వివిధ రకాల పంటలు సాగు చేసిన రైతుల వివరాల జాబితాలను ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా ఏఓ మాట్లాడుతూ జాబితాల్లో రైతుల పేర్లు, సాగు వివరాలను పొందుపరిచామని, జాబితా ల్లో ఏమైన మార్పులు, చేర్పులు ఉంటే ఆయా గ్రామాలలోని రైతులు రైతు భరోసా కేంద్రాలలో సరి చేసుకోవాలని ఆమె సూచించారు. ఈనెల 17వ తేదీ వరకు కేంద్రాలలో జాబితాలు అందు బాటులో ఉంటాయని రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు. కార్యక్రమంలో సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.



చేబ్రోలు ఆర్బీకే -1లో జరిగిన సమావేశంలో మాట్లాడుతున్న ఏఓ బి.శ్రీనివాస నాయక్, పొన్నూరు ఏడీఏ తిరుమలాదేవి



కాకుమానులో...

ప్రశాంతంగా ప్రారంభమైన ఇంటర్ పరీక్షలు

పెదనందిపాడు: ఇంటర్మీడియెట్ మొదటి సంవత్సరం పరీక్షలు మొదటి రోజు ప్రశాంతంగా ముగిశాయి. మంగళవారం ఉదయం స్థానిక పెదనందిపాడు ఆర్ట్స్ అండ్ సైన్సెస్ కళాశాలలో జరిగిన ఈ పరీక్షలలో 138 మందికి గాను 131 మంది హాజరయ్యారని, ఏడుగురు గైర్హాజరు అయినట్లు చీఫ్ సూపరింటెండెంట్ పాతూరి శ్రీనివాస్, డిపార్టుమెంటల్ ఆఫీసర్ వనితలు తెలిపారు. ఎక్కడా ఎటువంటి ఇబ్బంది తలెత్తకుండా పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

పరీక్ష కేంద్రాలను పరిశీలించిన తహసీల్దార్...

పొన్నూరు(చేబ్రోలు): పొన్నూరులో ఇంటర్ ప్రథమ సంత్సరం పరీక్షలు బుధవారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. పట్టణ పరిధిలోని సుజాత జూనియర్ కళాశాల, వెంకటేశ్వర జూనియర్ కళాశాల, పీబీఎస్ కాలేజీలలోని పరీక్ష కేంద్రాలలో పరీక్షలు జరిగాయి. తహసీల్దార్ శ్రీకాంత్ కేదార్‌నాథ్ పరీక్ష కేంద్రాల్లో తనిఖీ చేశారు. విద్యార్థులకు అవసరమైన మౌలిక వసతులు, తదితర ఏర్పాట్లను పరిశీలించారు. పరీక్షలు పగడ్బందీగా జరిగే విధంగా జాగ్రత్తలు తీసుకోవాలని సిబ్బందికి తహసీల్దార్ సూచించారు.



చివరి నిమిషంలో పరీక్ష హాల్‌లోకి పరుగులు తీస్తున్న విద్యార్థిని

నవధాన్యాల సాగుతో నేలకు ఉపయోగం

పెదనందిపాడు: నవధాన్యాల సాగు వలన చాలా ఉపయోగాలు ఉన్నాయని, ఎక్కువ విత్తనాలను భూమిలో చల్లి 45 రోజుల తర్వాత వాటిని భూమిలో కలియదున్నడం వలన భూమి సారవంతంగా మారుతుందని ప్రకృతి వ్యవసాయం మండల రిసోర్స్ పర్సన్ చింతా వరప్రసాదు అన్నారు. మంగళవారం మధ్యాహ్నం మండల పరిధిలోని కొప్పర్రు గ్రామంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో పాల్గొన్న చింతా వరప్రసాదు మాట్లాడుతూ 45 రోజుల తర్వాత భూమిని కలియదున్నడం వలన భూమి సారవంతంగా గుల్లబారి ప్రధాన పంటకు అన్ని రకాల పోషకాలను అందిస్తున్నదని, ప్రధాన పంట ఏపుగా పెరగటమే కాకుండా మంచి దిగుబడులను సాధించవచ్చని, నాణ్యమైన పంటను పొందవచ్చని ఆయన చెప్పారు. దీని వలన రైతులకు ఎరువుల ఖర్చు తగ్గుతుందని, రైతులు మంచి దిగుబడులు సాధించవచ్చని ఆయన రైతులకు తెలియజేశారు. ఈ ర్యాలీలో సర్పంచి సాతులూరి సురేష్, ఐసీఆర్‌పి సుబ్బారావు, పాఠశాల విద్యార్థులు, రైతులు పాల్గొన్నారు.



కొప్పర్రు గ్రామంలో నిర్వహిస్తున్న అవగాహన ర్యాలీ

వినియోగదారుల హక్కులపై అవగాహన అవసరం

గుంటూరు రూరల్: స్వచ్ఛమైన ఇంధన పరివర్తనల ద్వారా వినియోగదారులకకు సాధికారత కల్పించటం ప్రపంచ వినియోగదారుల హక్కుల దినోత్సవం ముఖ్య ఉద్దేశమని జిల్లా పౌర సరఫరాల అధికారిణి ఎస్.పద్మశ్రీ తెలిపారు. లాంఫాం నందున్న ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం పరిధిలోని సామాజిక విజ్ఞాన కళాశాలలో బుధవారం విద్యార్థులకు వినియోగదారుల హక్కులపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా పౌర సరఫరాల అధికారిణి మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ తమ హక్కులపై అవగాహన కలిగి ఉండాలన్నారు. అదేవిధంగా తాము వినియోగించుకుంటున్న వస్తువులు తదితరాలపై ఇబ్బందులుంటే ఏవిధంగా పరిష్కారాలు పొందాలో వివరించారు. సీసీఐ జాతీయ ఉపాధ్యక్షుడు, జిల్లా వినియోగదారుల సమాచార కేంద్రం ఇంచార్జి డాక్టర్ చదలవాడ హరిబాబు మాట్లాడుతూ వినియోగదారులు తమ సమస్యలను వినియోగదారుల ఫోరంలో వ్యాజ్యం వేసి ఏవిధంగా పరిహారం పొందాలో తెలిపారు. నూతన పునరుత్పాదక ఇంధన అభివృద్ధి సంస్థకు చెందిన కృష్ణారెడ్డి సౌర, వాయు, బయోగ్యాస్ ఇంధనాలను గురించి వివరించారు. గుంటూరు అసిస్టెంట్ ఫుడ్ కంట్రోలర్ గౌస్‌మోహిద్దీన్ ఆహార పదార్థాలలో కల్తీలు జరిగే విధానం, వాటిని గుర్తించే విధానంపై వివరించారు. వినియోగదారుల సమాచారం గురించి ప్రదర్శన నిర్వహించారు. కార్యక్రమంలో సామాజిక విజ్ఞాన కళాశాల డీన్ డాక్టర్ సీహెచ్ చిరంజీవి, అసోసియేట్ డీన్ డాక్టర్ ఎంఎస్ చైతన్యకుమారి, ప్రొఫెసర్ డాక్టర్ చిల్కిస్, అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ వి.ప్రసూన, ఎం.శిరీష, డాక్టర్ వి.శ్రవణ్‌బాబు, వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

క్యాంపస్ ఇంటర్వ్యూల్లో 207 మంది ఎంపిక

చేబ్రోలు: చేబ్రోలు మండలం వడ్లమూడి విజ్ఞాన్ లారా ఇంజినీరింగ్ కళాశాల నాలుగో సంవత్సరానికి చెందిన 207 మంది విద్యార్థులు ప్రముఖ బహుళజాతి కోర్ కంపెనీలైన రామ్‌టెక్, ఇసూజు, మౌల్డ్ టెక్, మైల్ కాల్, సున్వి ఇంజినీరింగ్, ఎఫ్ఫాట్రానిక్స్, ఎక్సెల్‌టెక్ వంటి కంపెనీలకు ఎంపికయ్యారని ప్రిన్సిపాల్ కేపీ కుమార్ బుధవారం తెలిపారు. ప్రిన్సిపాల్ మాట్లాడుతూ ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులు గరిష్టంగా రూ.5.3 లక్షల వార్షిక వేతనం అందుకోనున్నారని వెల్లడించారు. ఐటీ రంగంలో మాంద్యం ముంచుకొస్తున్న తరుణంలో ప్రస్తుతం ఐటీ కంపెనీలు ఉద్యోగ నియామకాలు చేపట్టే పరిస్థితులు లేవన్నారు. అటువంటి పరిస్థితుల్లో కూడా తమ కళాశాలకు చెందిన విద్యార్థులు ప్రాంగణ ఎంపికల్లో సత్తాచాటారని పేర్కొన్నారు. గత మూడు రోజులుగా వివిధ కంపెనీలు నిర్వహించిన ప్రాంగణ ఎంపికల్లో ఉద్యోగాలకు ఎంపికైన 207 మంది విద్యార్థులను విజ్ఞాన్ విద్యాసంస్థల చైర్మన్ లావు రత్తయ్య తదితరులు అభినందించారు.



ప్రతిభ కనబరిచి ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులతో విజ్ఞాన్ విద్యాసంస్థల చైర్మన్ లావు రత్తయ్య

విద్యుత్ విజిలెన్స్ తనిఖీలు

చేబ్రోలు మండలంలో 105 సర్వీసులకు రూ.4.73లక్షలు అపరాధ రుసుం

చేబ్రోలు: నిబంధనలకు విరుద్ధంగా విద్యుత్ ఉపయోగిస్తున్న చేబ్రోలు మండలంలోని 105మంది వినియోగదారులకు రూ.4.73లక్షలు అపరాధ రుసుం విధించినట్లు గుంటూరు జిల్లా విజిలెన్స్ విభాగం, తెనాలి డివిజన్ ఆపరేషన్ అధికారులు బుధవారం తెలిపారు. చేబ్రోలు విద్యుత్ సబ్ స్టేషన్ వద్ద గుంటూరు డీపీఈ, ఈఈ కేవీఎల్ఎన్ మూర్తి, తెనాలి ఆపరేషన్ ఈఈ వీవీ చిరంజీవి, డిప్యూటీ ఈఈ ఆపరేషన్ ఆర్.శ్రీనివాసరావు, చేబ్రోలు ఏఈ పీవీ సుధీర్‌లు వివరాలను వెల్లడించారు. చేబ్రోలు మండలంలోని వివిధ గ్రామాల్లో ప్రత్యేక బృందాలు 5885 విద్యుత్ సర్వీసులను తనిఖీ చేశారు. అధికలోడు వినియోగిస్తున్న 105మంది వినియోగదారులకు రూ.4,72,700లు అపరాధ రుసుం విధించినట్లు తెలిపారు. ఏపీటీఎస్ విజిలెన్స్ విభాగం, తెనాలి డివిజన్ విద్యుత్‌శాఖ సిబ్బంది ఈ తనిఖీల్లో పాల్గొన్నట్లు స్థానిక ఏఈ పీవీ సుధీర్ తెలిపారు.



చేబ్రోలు విద్యుత్ సబ్ స్టేషన్ వద్ద వివరాలను వెల్లడిస్తున్న విద్యుత్‌శాఖ, విజిలెన్స్ అధికారులు

ఆన్‌లైన్ మోసం

గుంటూరు ఈస్ట్ : ఆన్‌లైన్ మోసంపై నగరంపాలెం పోలీసులు కేసు నమోదుచేశారు. పోలీసుల కథనం ప్రకారం.. వెస్ట్ ట్రాఫిక్ స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా పనిచేసే వి.రాధారాణి ఈనెల మొదటి వారంలో విజయనగరం సమీపంలోని రాజాంకు డీటీడీసీ కొరియర్‌లో లెటర్ పంపింది. లెటర్ చేరకపోవడంతో ఆన్‌లైన్‌లో డీటీడీసీ సర్వీస్ ఫోన్ నంబరు వెతికి ఆ నంబరుకు ఫోన్ చేసింది. ఫోన్‌లో మాట్లాడిన వ్యక్తి రాధారాణికి లింక్ పంపి రూ. 5 చెల్లించాలని కోరాడు. దీంతో ఈనెల 6వ తేదీ లింక్ ఓపెన్ చేసి రూ.5 చెల్లించింది. కొంత సమయం తరువాత రూ. 5 తిరిగి రాధారాణి అకౌంట్‌లో క్రెడిట్ అయ్యాయి. 7వ తేదీ రాధారాణి అకౌంట్ నుంచి రూ.38వేలు విత్‌డ్రా అయ్యాయి. మోసపోయినట్లు గుర్తించిన బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేసింది.

చైన్ స్నాచింగ్‌పై కేసు

గుంటూరు ఈస్ట్: రెండు వేర్వేరు ప్రాంతాల్లో చైన్‌స్నాచింగ్ జరిగిన ఘటనపై అరండల్‌పేట పోలీసులు కేసు నమోదు చేశారు. రాజీవ్‌గాంధీ నగర్‌కు చెందిన పి.సరోజని నడుచుకుంటూ వెళ్తున్న సమయంలో ఓ అగంతకుడు ఆమె వద్దకు వచ్చి మెడలోని ఆరు సవర్ల బంగారు గొలుసు తెంచుకుని పరారయ్యేందుకు యత్నించాడు. సరోజని ప్రతిఘటించి కొంత బంగారు చైను తన చేతిలో పట్టుకుంది. మిగిలిన భాగం అగంతకుడు తెంచుకుని పరారయ్యాడు. మరో ఘటనలో భీమవరానికి చెందిన సత్యవతి బుధవారం రైలు దిగి దేవాపురం వెళ్లే క్రమంలో రైల్వే క్వార్టర్స్ వద్దకు వచ్చింది.



